# రజతోత్సవ సభను విజయవంతం చేయాలి



కొల్చారంలో వాల్‌పోస్టర్ రాస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డిని ఆసక్తిగా పరిశీలిస్తున్న నాయకులు



శివ్వంపేటలో వాల్‌రైటింగ్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే సునీతారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు


రేగోడ్ మండల కేంద్రంలో చలో వరంగల్ పోస్టర్‌ను గోడపై వేసిన మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్

శివ్వంపేట, ఏప్రిల్ 12: ఈ నెల 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని చిన్నగొట్టిముక్ల చౌరస్తా నుంచి ఉసిరికపల్లి చౌరస్తా వరకు వాల్‌రైటింగ్ పెయింటింగ్‌ను ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకులతో కలిసి వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్వహించే ఈ సభకు ప్రజలు స్వచ్ఛందంగా రావడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఎవరి నోటా విన్నా చలో వరంగల్ అని వినిపిస్తున్నదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమణాగౌడ్, జడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యుడు మన్సూర్, సీనియర్ నాయకులు హనుమంత్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, లాయక్, యాదాగౌడ్, భిక్షపతిరెడ్డి, మహేందర్‌రెడ్డి, శ్రీశైలంయాదవ్, బాబూరావు ఉన్నారు.

### కొల్చారంలో..

కొల్చారం, ఏప్రిల్ 12: కేసీఆర్ నాయకత్వం వర్ధిల్లాలి, చలో వరంగల్ అనే నినాదాన్ని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి స్వయంగా శుక్రవారం రంగంపేటలోని ఓ గోడపై రాశారు. శుక్రవారం సాయంత్రం జోగిపేట– మెదక్ రోడ్డు పక్కన ఓ గోడపై పెయింటర్ బీఆర్ఎస్ రజతోత్సవ మహా సభ వాల్‌రైటింగ్ చేస్తూ కనిపించాడు. రంగంపేట నుంచి సంగాయిపేటకు వెళ్తున్న ఎమ్మెల్యే అది గమనించి కారు దిగి అక్కడికి వెళ్లారు. పెయింటర్ బార్డర్ గీసి తెల్ల రంగు వేసి సిద్ధంగా ఉంచిన గోడపై ఎమ్మెల్యే బ్రష్‌తో ఈ నినాదాలు రాశారు. ఎమ్మెల్యే రాస్తున్నంత సేపు నాయకులంతా ఆసక్తితో పరిశీలించారు. అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి మండలంలో పర్యటించారు. ఎమ్మెల్యే వెంట పార్టీ మండలాధ్యక్షుడు గౌరీశంకర్, యువత అధ్యక్షుడు సంతోష్‌రావు, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ అరిగె రమేశ్, మాజీ ఎంపీపీ మంజులా కాశీనాథ్, ఇంద్రసేనారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, మల్లేశం, రాజాగౌడ్, దుర్గేశ్ పాల్గొన్నారు.

### రేగోడ్‌లో మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్

రేగోడ్, ఏప్రిల్ 12: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశానికి మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 27న నిర్వహించనున్న రజతోత్సవ సభలో కార్యకర్తలు నాయకులు భారీ సంఖ్యలో పాల్గొనాలని దిశానిర్దేశం చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బుచ్చయ్య, మాజీ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రవీందర్, నాయకులు రమేశ్, పీఏసీఎస్ చైర్మన్ రాజుయాదవ్, మాజీ ఎంపీటీసీ నర్సింలు, రాచోటి సుభాష్ పాల్గొన్నారు.

### మెదక్‌లో..



మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 12: ఈనెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో జరుగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయంతం చేయాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆరేళ్ల మల్లికార్జుగౌడ్ శనివారం ప్రకటనలో పిలుపునిచ్చారు. రోజతోత్సవ సభ ప్రజల సభ అన్నారు. కేసీఆర్ లేకపోతే తెలంగాణ వచ్చేది కాదని, ఆయన పోరాటంతోనే తెలంగాణ సాధించామని కొనియాడారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో యావత్తు దేశాన్ని తెలంగాణ వైపు చూసేలా చేసిన పాలనాదక్షుడు కేసీఆర్ అన్నారు. ప్రజల ఆలోచన విధంగా కేసీఆర్ పాలన చేశారన్నారు. రజతోత్సవ సభలో కేసీఆర్ ఏంచెబుతారో అని తెలంగాణ ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. రజతోత్సవ సభకు జిల్లా నుంచి పెద్ద ఎత్తు తరలి వెళ్లి సభను విజయవంతం చేయాలన్నారు.

## డ్రగ్స్‌తో యువశక్తి నిర్వీర్యం: ఎస్పీ



అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ అర్బన్, ఏప్రిల్ 12: డ్రగ్స్‌తో సమాజంలో యువ శక్తి నిర్వీర్యం అవుతున్నదని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ ఆధ్వర్యంలో డ్రగ్స్ నిర్మూలనలో భాగంగా అవగాహన పోస్టర్‌ను ఎస్పీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. డ్రగ్స్ మత్తులో దాడులు, నేరాలు పెరుగుతున్నాయన్నారు. పోలీస్ శాఖ డ్రగ్స్ నిర్మూలనకు కృషి చేస్తున్నదని, పౌరులు, ప్రజలు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. విద్యార్థులు, యువతలో మార్పురావాలన్నారు. డ్రగ్స్ వినియోగంతో శరీరంలో శక్తి తగ్గుతుందని, భవిష్యత్తును కోల్పోతారని పేర్కొన్నారు. గంజాయి, కొకెయిన్, హెరాయిన్ లాంటి మాదకద్రవ్యాలతో సర్వం కోల్పోతారన్నారు. మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్, సీఐ రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల్లో దివ్యాంగులకు ప్రాతినిధ్యం కల్పించాలి



మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 12: స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగులకు ప్రాతినిధ్యం కల్పించాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడివయ్య కోరారు. శనివారం జిల్లా కేంద్రంలోని కేవల్ కిషన్ భవన్‌లో జిల్లా విస్తృత సమావేశం జిల్లా కార్యదర్శి యశోద అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసరా పింఛన్లను పెంచుతామని కాంగ్రెస్ హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చినా పెంచకపోవడం సిగ్గుచేటన్నారు. దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి మే 2న కలెక్టరేట్ ఎదుట 24 గంటల మహాధర్నా చేపడుతామన్నారు. కొత్త పింఛన్ల కోసం 24.85 లక్షల మంది దరఖాస్తు చేసుకొని 15 నెలలు గడుస్తున్నా నేటికి ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. రాజీవ్ యువ వికాసంలో దివ్యాంగులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశం మాట్లాడుతూ క్రూడాయిల్ ధరలు తగ్గినా గ్యాస్ సిలిండర్ ధర పెంచడం విడ్డూరంగా ఉందన్నారు. కేంద్రం రూ.50ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్‌పీఆర్డీ మహిళా విభాగం రాష్ట్ర కోఆర్డినేటర్ కవిత, జిల్లా అధక్షురాలు ముత్యాలు, నాయకులు చంద్రం, కిష్టయ్య, చంద్రకళ, యాదగిరి, శ్రీదేవి, సురేందర్, విఠల్, సావిత్రి, రాణి, నవీన్ పాల్గొన్నారు.

### పరిస్థితి విషమించి ఒకరు మృతి

పాపన్నపేట, ఏప్రిల్ 12: చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి వృద్ధుడు మృతి చెందిన ఘటన పాపన్నపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని చీకోడ్ గ్రామంలో జరిగింది. ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ కథనం మేరకు.. గడ్డం పెంటారెడ్డి(72) వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. రోజు మాదిరిగానే ఈ నెల 3న ఇంట్లో నిద్రించాడు. అర్ధ రాత్రి సమయంలో మంచంపై నుంచి కిందపడడంతో తలకు గాయమైంది. కుటుంబీకులు గమనించి వైద్యం చేయించారు. ఈ నెల 11న మెదక్ ఏరియా దవాఖానకు అక్కడి, నుంచి గాంధీకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో శనివారం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

మనోహరాబాద్, ఏప్రిల్ 12: రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందిన ఘటన తూప్రాన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం.. మాసాయిపేట మండలం చెట్ల తిమ్మాయిపల్లి తండాకు చెందిన కాట్రోత్ గోప్యా (60) నర్సంపల్లిలో తమ బంధువుల శుభ కార్యానికి హాజరై, మోపెడ్‌పై స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో నర్సంపల్లి వైపు వెళ్తున్న లారీ కొట్రోత్ గోప్యాను ఢీకొట్టింది. దీంతో గోప్యా అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### గొర్లకాపర్ల రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి


రామాయంపేట, ఏప్రిల్ 12: తెలంగాణ గొర్ల కాపర్ల సంఘం రాష్ట్ర నాల్గో మహా సభలను విజయవంతం చేయాలని గొర్లకాపర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఊడెం దేవరాజు యాదవ్ పేర్కొన్నారు. శనివారం రామాయంపేటలో మాట్లాడుతూ ఆదివారం యాదగిరిగుట్ట దేవస్థానం వద్ద రాష్ట్ర వ్యాప్తంగా గొర్లకాపర్ల సంక్షేమ సంఘం సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

### బోరుమోటర్ అందజేసిన మాజీ జడ్పీటీసీ



శివ్వంపేట, ఏప్రిల్ 12: శివ్వంపేటలోని 2, 7, 8, 9వ వార్డుల్లో నీటి సమస్య ఉన్నందున రూ.15 వేల జట్ పంపును మాజీ జడ్పీటీసీ పబ్బమహేశ్‌గుప్తా శనివారం అందజేశారు.

### మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు



చేగుంట, ఏప్రిల్ 12: నార్సింగి ప్రజలకు తాగు నీటిని అందించడం కోసం యెర్రం అన్నమ్మ, గుండయ్య, యెర్రం సరళ జ్ఞాపకార్థం మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు మండల సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు యెర్రం అశోక్ తెలిపారు. మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు ఆకుల మల్లేశంగౌడ్, చంద్రశేఖర్, వెంకటేశ్, శ్రీనివాస్, సంతోష్, ఆనంద్, అమర్, నరేశ్, బొట్టు శ్రీనివాస్ ఉన్నారు.

### పౌష్టికాహారంపై అవగాహన

నిజాంపేట, ఏప్రిల్ 12: నిజాంపేటలోని పల్లె దవాఖానలో ఏఎన్ఎంలు అనురాధ, బాలమణి గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై శనివారం అవగాహన కల్పించారు. గర్భస్థ శిశువు ఎదుగుదలకు అంగన్‌వాడీ కార్యకర్తలు అందించే పౌష్టికాహారం దోహదపడుతుందన్నారు. అంగన్‌వాడీలు అరుణ, దుర్గేశ్వరి, మణెమ్మ, ఆశవర్కర్లు లక్ష్మి, అనిత ఉన్నారు.

## ఉపాధి పనిదినాలు పెంచాలి

- ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- కలెక్టర్ రాహుల్‌రాజ్


గడ్డపారతో కందకాలు తవ్వుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్


పొలాలు పరిశీలించి రైతుతో మాట్లాడుతున్న కలెక్టర్

రామాయంపేట రూరల్, ఏప్రిల్12: ఉపాధి పని దినాలు పెంచి, కార్డున్న ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశించారు. మండలంలోని పర్వతాపూర్ అటవీ ప్రాంతంలో ఉపాధి పనులను కలెక్టర్ శనివారం పరిశీలించారు. ఆయన కాలినడకన అటవీప్రాంతంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. గడ్డపార పట్టి కందకాలు తీశారు. అనంతరం ఉపాధి కూలీలతో మాట్లాడారు. ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నిబంధనల మేరకు పనులు చేయాలని కూలీలు తీసిన కందకాలను కలెక్టర్ స్వయంగా కొలతలు వేసి చూశారు. జిల్లాలో ప్రతి గ్రామంలో సుమారు 50కి పైగా ఉపాధి పనులు చేస్తున్నారని, వందకు చేరాలన్నారు. కందకాలు తీయడం, సీసీ రోడ్డు, డ్రైనేజీలు కట్టడం, వ్యవసాయ పనులు చేసుకోవడానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. పంట పొలాలను పరిశీలించి రైతులను పంటల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కాట్రియాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారం అందేలా వంటలు చేయాలని ఉపాధ్యాయులు, భోజన నిర్వాహకులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో షాజలోద్దీన్, ఏపీవో శంకర్, టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాస్ ఉన్నారు.

### ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలి

చేగుంట, ఏప్రిల్ 12: చేగుంట నుంచి గజ్వేల్‌కు వెళ్లే రహదారిపై రోజూ రెండు మూడు వందల వాహనాలు వెళ్తున్నాయి. గతంలో రోడ్డు విస్తారణ లేకముందు మహారాష్ట్ర నుంచి మెదక్ మీదుగా ఈ వాహనాలు తూప్రాన్, గజ్వేల్, భువనగిరి, వరంగల్, హనుమకొండ, యాదగిరిగుట్ట, కొముురవెల్లి తదితర ప్రాంతాలకు వెళ్లేవి. బీఆర్ఎస్ ప్రభుత్వం రెండు లేన్ల రోడ్డుగా విస్తరించింది. దీంతో నిత్యం అధిక లోడుతో భారీ వాహనాలు వెళ్లడంతో ఈ రహదారి దెబ్బతిన్నది. వాహనాల రాకపోకలు ఎక్కువ కావడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో గ్రామాల్లో స్వచ్ఛందంగా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటుచేసుకున్నారు. వాటిని సంబంధిత అధికారులు సరిచేయక పోవడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నట్లు రైతులు, వాహనదారులు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడి రోడ్డు ప్రమాదాలు జరగకుండ చర్యలు చేపట్టాలని సూచించారు.

### బీవీఆర్‌ఐటీ కళాశాలలో ఎథీన్స్ 2కే25


పాటలతో విద్యార్థులను ఉర్రూతలూగిస్తున్న సింగర్లు

నర్సాపూర్, ఏప్రిల్ 12: నర్సాపూర్‌లోని బీవీఆర్‌ఐటీ కళాశాలలో శనివారం 28వ వార్షికోత్సవం సందర్భంగా రెండో రోజు విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమం ఎథిన్స్ 2కే25ను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు పుస్తకాలు, కోడింగ్, హ్యాకథాన్స్, ప్రాజెక్టులు, ఇంటర్న్‌షిప్‌లతో బిజీబిజీగా ఉన్న, వారు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆటపాటలతో మునిగిపోయారు. ప్రిన్సిపాల్ డా.సంజయ్ దూబే, కళాశాల డైరెక్టర్ డా.లక్ష్మీప్రసాద్, ఫిల్మ్ జర్నలిస్ట్ రామ్ వెంకటశ్రీకర్, డైరెక్టర్ వివేక్ ఆత్రేయ పాల్గొన్నారు.

### ఏడుపాయల్లో దుర్గమ్మకు పల్లకీ సేవ




పాపన్నపేట, ఏప్రిల్ 12: ఏడుపాయల వనదుర్గా భవానీ మాత సన్నిధిలో శనివారం పౌర్ణమిని పురస్కరించుకుని పల్లకీ సేవ నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి రాజగోపురం మీదుగా పల్లకీలో ఊరేగించారు. ఏడుపాయల వనదుర్గా భవానీ మాతను మెదక్ ఆర్డీవో రమాదేవి దంపతులు దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పూజారులు ఆమెకు తీర్థప్రసాదాలు అందజేశారు.

### ప్రాణాలు కాపాడిన పోలీసులకు సన్మానం



శివ్వంపేట, ఏప్రిల్ 12: దేవమ్మగూడెం తండాకు చెందిన లున్సావత్ రాజుకు సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడిన పోలీసులు విష్ణువర్ధన్, మహేందర్‌ను ఎస్సై మధుకర్‌రెడ్డి నగదు ప్రోత్సాహకం అందజేసి అభినందించారు. పులిమామిడి నవీన్‌గుప్తా, చింతల కరుణాకర్‌రెడ్డి, పలువురు సన్మానించి రూ.5వేలు అందజేశారు.

### ఆయిల్ పాం సాగుతో అధిక ఆదాయం


ఆయిల్ పాంపై అవగాహన కలిపిస్తున్న ఫీల్డ్ ఆఫీసర్ సుజాత, ఏఈవో శోభ

చేగుంట, ఏప్రిల్ 12: ఆయిల్‌పాం సాగుతో అధిక ఆదాయం పొందవచ్చని ఉద్యానవన శా ఖ ఫీల్డ్ ఆఫీసర్ సుజాత, చేగుంట ఏఈవో శో భ పేర్కొన్నారు. శనివారం పెద్ద శివునూర్‌లో ఉపాధి కూలీలు, రైతులతో సమావేశం ఏర్పా టు చేశారు. ఉద్యానవన శాఖ ద్వారా ఆయిల్ పాం సాగుకు ప్రభుత్వం సబ్సిడీలో డ్రిప్‌లు, స్వల్పకాలంలో దీర్ఘకాలిక ఆదాయం పొం దేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఆయిల్‌పాం సాగుకు ప్రభుత్వం అధిక శాతం రాయితీ ఇస్తున్నదని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### బాలుడిపై వీధికుక్క దాడి



నర్సాపూర్, ఏప్రిల్ 12: మున్సిపాలిటీలో వీధి కుక్కల దాడులు రోజురోజుకు తీవ్రతరం అవుతున్నాయి. వారం క్రితం బ్యాగరి జలంధర్‌పై దాడి, శనివారం మరో బాలుడిని గాయపరిచిన ఘటన చోటుచేసుకున్న ది. వివరాల్లోకి వెళ్లితే.. మున్సిపాలిటీలోని 1వ వార్డు కు చెందిన బాలుడు ఉద్భవ్ ఆడుకుంటుండ గా ఓ వీధికుక్క అతనిపై దాడిచేసి గాయపరిచింది. కుటుంబ సభ్యులు బాలుడిని దవాఖానకు తీసుకెళ్లి వైద్యం అందించారు. మున్సిపల్ అధికారులు తమ బాధలు పట్టించుకోవాలని పట్ట ణ వాసులు సోషల్‌మీడియా వేదికగా ఆక్రోశం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు తగిన చర్యలు తీసుకుని కుక్కల దాడి నుంచి తమను కాపాడాలని డిమాండ్ చేస్తున్నారు.

### ద్విచక్రవాహనంపై నుంచి పడి వ్యక్తి మృతి

చేగుంట, ఏప్రిల్ 12: రోడ్డుపై ఎత్తుగా వేసిన స్పీడ్‌బ్రేక్ దాటుతూ ద్విచక్రవాహనంపై నుంచి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని కర్నాల్‌పల్లిలో జరిగింది. చేగుంట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెల్దుర్తి మండలం అచ్చంపేట గ్రామానికి చెందిన కత్తెర బాలయ్య(50) తన ద్విచక్రవాహనంపై అచ్చంపేట నుంచి దౌల్తాబాద్ మండలం మందాపూర్‌లోని తన బంధువుల ఇంటికి శుక్రవారం వెళ్తున్నాడు. కర్నాల్‌పల్లిలో రోడ్డుకు అడ్డుగా వేసిన స్పీడ్ బ్రెకర్లు ఎక్కువ ఎత్తుగా ఉండడంతో ద్విచక్రవాహనంపై వెళ్తున్న బాలయ్య కిందపడ్డాడు. దీంతో ఆయన తల భాగంలో బలంగా దెబ్బ తగలడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. స్థానికులు గమనించి 108 వాహనానికి సమాచారం ఇవ్వడంతో బాలయ్యను గాంధీ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి సోదరుడు నగేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చేగుంట ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.

## ఘనంగా హనుమాన్ జయంతి


హనుమాన్ శోభాయాత్రలో పాల్గొన్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి


కొల్చారంలో..


రామాయంపేటలో రథయాత్ర

ఆలయాల్లో హనుమాన్ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయాలలో ఉద యం స్వామి వారికి పంచామృతభిషేకం, మ హాదివ్య అలంకరణ, మహా మంగళ హారతి, హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. **-న్యూస్‌నెట్‌వర్క్, మెదక్, ఏప్రిల్ 12**

### ఉపాధ్యాయుల స్పోర్ట్స్ మీట్ విజయవంతం




నర్సాపూర్, ఏప్రిల్ 12: టీఎస్‌యూటీఎఫ్ నర్సాపూర్ కమిటీ ఆధ్వర్యంలో టీఎస్‌యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పట్టణంలో శనివారం స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. ఇందులో భాగంగా షాట్‌పుట్, రన్నిం గ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆస్తి కోసం తండ్రిపై హత్యాయత్నం


రక్తం మడుగులో దశరథ్

నర్సాపూర్, ఏప్రిల్ 12: ఆస్తి పంచివ్వాలంటూ కన్న తండ్రిపై కొడుకు కత్తితో హత్యాయత్నానికి పాల్పడిన ఘటన నర్సాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చిన్నచింతకుంటలో జరిగింది. ఎస్సై లింగం తెలిపిన వివరాల ప్రకారం.. దశరథ్(60)కు ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్లు. పెద్ద కుమారుడు, ఇద్దరు కూతుళ్లకు వివాహం చేశాడు. పెద్ద కుమారుడు నాగరాజు నర్సాపూర్‌లో ఉంటూ టైలరింగ్ చేస్తూ జీవిస్తున్నాడు. రెండు రోజులగా ఆస్తి పంచి ఇవ్వాలంటూ తండ్రితో గొడవపడుతున్నాడు. శనివారం తనతో పాటు కత్తిని తీసుకొచ్చి తండ్రితో గొడవపడ్డాడు. విచక్షణ కోల్పోయి తండ్రిపై నాగరాజు కిరాతకంగా కత్తితో దాడికి పాల్పడ్డాడు. అనంతరం అక్కడి నుంచి పారిపోయాడు. గతంలోనూ నాగరాజు ఆస్తి గురించి కుటుంబ సభ్యులతో తరుచూ గొడవపడేవాడు. దాడిలో తీవ్రంగా గాయపడ్డ దశరథ్‌ను మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ప్రైవేట్ దవాఖానకు తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్సై తెలిపారు.

### అంబేద్కర్ విగ్రహానికి మరమ్మతులు



నర్సాపూర్, ఏప్రిల్ 12: నర్సాపూర్‌లోని చిల్డ్రన్స్ పార్కులో గల అంబేద్కర్ విగ్రహానికి శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ పైడి శ్రీధర్ గుప్తా శనివారం మరమ్మతులు చేయించారు. ఫోర్‌లేన్ రోడ్డు విస్తరణలో భాగంగా ప్రధాన రహదారిపై ఉన్న అంబేద్కర్ ఇతర ప్రముఖుల విగ్రహాలను చిల్డ్రన్స్ పార్కులోకి తరలించామని, వీటిని పట్టించుకోకపోవడంతో అంబేద్కర్ విగ్రహం డ్యామేజ్ అయ్యిందని ఆయన తెలిపారు. విగ్రహానికి మరమ్మతులు, రంగులు వేయించినట్లు తెలిపారు.

### సీఈవో విధులకు ఆటంకం కల్గిస్తున్న పాలక వర్గం


సొసైటీ బయటే వేచి ఉన్న సీఈవో

కొల్చారం, ఏప్రిల్ 12: హైకోర్టు తీర్పును బేఖాతరు చేస్తూ తాను విధులు నిర్వహించకుండా పాలకవర్గం సభ్యులు ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ సీఈవో తాను పనిచేసిన కార్యాలయం ఎదుట శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చిన్నఘనపూర్ సొసైటీ సీఈవో సత్యనారాయణరెడ్డికి పాలక వర్గానికి మధ్య కొన్నేండ్లుగా వివాదం కొనసాగుతున్నది. ఖర్చు చేసిన నిధులకు సంబంధించి ఓచర్లు ఇవ్వాలని పాలక వర్గం అడగడంతో ఆయన నిరాకరించారు. దీంతో ఆయనను ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే పక్కన పెట్టారు. దీంతో ఆయన కార్యాలయాలు, జిల్లా అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో హైకోర్టుకు వెళ్లాడు. హైకోర్టు కలెక్టర్‌తో పాటు ఐదుగురు అధికారులకు నోటీసులు ఇస్తూ కారణం లేకుండా తొలిగించడమేంటని, తక్షణమే విధుల్లోకి తీసుకుని, 44 నెలల జీతం చెల్లించాలని ఆదేశాలిచ్చింది. సోమవారం జిల్లా సహకార అధికారి కరుణాకర్ చిన్న ఘనపూర్ సొసైటీకి వచ్చి సత్యనారాణ రెడ్డికి సీఈవోగా బాధ్యతలు అప్పగించారు. మూడు రోజుల పాటు సాఫీగా విధులు నిర్వహించిన ఆయనకు శుక్రవారం చుక్కెదురైంది. కార్యాలయానికి తాళం వేశారు. మధ్యాహ్నం వరకు వేచి చూసిన సీఈవో కార్యాలయం బయటనే భోజనం చేసి, ఇంటికెళ్లారు. హైకోర్టు ఆదేశాలిచ్చినా పాలకవర్గం నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఉన్నతాధికారులు స్పందించాలని ఆయన కోరుతున్నారు.

## పదకొండేండ్లకు కొడుకు జాడ


వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ, వెనకాల చిత్రంలో తేజసాయి

మెదక్ అర్బన్, ఏప్రిల్ 12: ఇంజినీరింగ్ చదువుతున్న యువకుడు తల్లిదండ్రులకు చెప్పకుండా పదకొండేండ్ల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఎక్కడ ఉన్నాడో తెలియని తల్లిదండ్రులు ఆశలు వదులుకున్నారు. శనివారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి సమావేశం ఏర్పాటు చేసి వివరాలు తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ పాపన్నపేట మండలంలోని కుర్తివాడకు చెందిన శారదా శ్రీనివాస్‌రావు కుమారుడు తేజసాయి డీఆర్‌కే ఇంజినీరింగ్ కళాశాలలో 2014లో మొదటి సంవత్సరంలో చేరాడు. తల్లిదండ్రులపై భారం కావద్దన్న ఉద్దేశంతో 7 సెప్టెంబర్ 2014లో ఇంట్లోంచి వెళ్లిపోయాడు. కొన్నాళ్ల పాటు ఆచూకీ కోసం గాలించినా, ఎలాంటి సమాచారం లభించలేదు. పదేండ్లు గడిచిపోయింది. 3 ఏప్రిల్ 2025న పాపన్నపేట పోలీస్‌స్టేషన్‌లో మళ్లీ ఫిర్యాదు చేశారు. పోలీసులు చాలెంజ్‌గా తీసుకుని విచారణ చేపట్టారు. తేజసాయి బెంగళూరులో ఉన్నట్లు గుర్తించారు. డీఎస్పీ ప్రసన్నకుమార్ పర్యవేక్షణలో మెదక్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ కేసును ఛేదించారు.